
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 26 । జూలై । 2023



### సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 24.380 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 1,901 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | - రూ.61,220 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) | - రూ.5,498 |
| 3 శాతం జీఎస్టీతో.. | - రూ.5,663 |
| నవర (8 గ్రా) | - రూ.45,304 |

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /25.1

మంగళవారం గాలిలో తేమ 92 శాతం ఉంది. బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

## న్యూస్‌రీల్

### విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

- పాఠశాలల టెక్స్‌బుక్స్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి



విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివిస్తున్న డైరెక్టర్ రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా నాడు–నేడు పథకం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టెక్స్‌బుక్స్ పంపిణీ, వసతుల ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాలల టెక్స్‌బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రారెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు. పాఠశాలలలో వసతులు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సోమవరపు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్పెషల్ పీపీగా శ్రీధర్‌రావు



శ్రీధర్‌రావు

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది సీహెచ్ శ్రీధర్‌రావును ఏపీ పీడీఎఫ్‌ఈ (ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నెల్లూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రభుత్వం తరఫున ఏపీపీడీఎఫ్ఏకు సంబంధించిన కేసులు వాదిస్తారు. ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారు. ఈ సందర్భంగా నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ తనను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించేందుకు సహాయ సహకారాలు అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### శ్రీఇరుకళల పరమేశ్వరి ఆలయాభివృద్ధికి చర్యలు



ఆలయంలో ఢిల్లీరెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామ దేవత శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ బోర్డు అడ్మినిస్ట్రేషన్ జోనల్ ఆఫీసర్ ఢిల్లీరెడ్డి తెలిపారు. ఇందుకోసం టీటీడీ బోర్డు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సుమారు రూ.2.53 కోట్లు అంచనా వ్యయంతో కూడిన ప్రతిపాదనను దేవస్థానం ధర్మకర్తల మండలి టీటీడీ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌కు పంపించారని తెలిపారు. దీంతో సానుకూలంగా స్పందించిన వైవీ సుబ్బారెడ్డి టీటీడీ బోర్డు శ్రీవాణి ట్రస్ట్‌కు సిఫారసు చేశారన్నారు. మంగళవారం జిల్లా ప్రోగ్రాం ఆర్గనైజింగ్ అసిస్టెంట్ స్వామి, హిందూధార్మిక మండలి సభ్యుడు జయరామయ్యతో కలిసి ఆయన అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. తొలుత ఢిల్లీరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### ఇన్‌చార్జి మంత్రి సమీక్ష వాయిదా

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన బుధవారం జరగాల్సిన ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల సమీక్షలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి (సీపీఓ) ఏఎస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నియోజకవర్గాలకు జరగాల్సిన సమీక్ష సమావేశాలు ఎప్పుడు నిర్వహించేది తిరిగి తెలియజేస్తామని పేర్కొన్నారు.

### 765 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతుల నుంచి మంగళవారం 765 పొగాకు బేళ్లు కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 788 బేళ్లు వేలం కేంద్రానికి తీసుకుని రాగా 23 బేళ్లు తిరస్కరించామని తెలిపారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.251, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.232.50ల చొప్పున నమోదు అయిందని తెలిపారు.

# అమృత ధారలు



ఒకప్పుడు కందుకూరులో గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడాల్సివచ్చేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు వైఎస్సార్ హయాంలో రూ.100 కోట్లు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపారు. అనంతర కాలంలో పట్టణం విస్తరించడం, జనాభా పెరగడంతో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం అమృత్ 2.0 పథకానికి కందుకూరు మున్సిపాలిటీ ఎంపిక కావడంతో ఈ నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది.

- మంచినీటి సరఫరా మెరుగుకు ప్రణాళిక
- నీటిశుద్ధి ప్లాంట్, పైప్‌లైన్ పునర్నిర్మాణానికి చర్యలు
- డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్న అధికారులు



కందుకూరు పట్టణ వ్యూ

కందుకూరు: రానున్న రోజుల్లో కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా మెరుగుపడనుంది. రోజంతా నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా, విలీన గ్రామాలతోపాటు శివారు ప్రాంతాలకు సైతం నీటిసరఫరాను మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకానికి కందుకూరు మున్సిపాలిటీ ఎంపిక కావడమే ఇందుకు ప్రధాన కారణం. ఇప్పటికే ఈ పథకం ద్వారా రూ.25.7 కోట్ల నిధులు మంజూరు కాగా, త్వరలోనే డీపీఆర్ తయారు చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. దీంతో పట్టణంలో నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపడనుంది.

**నూతనంగా 5 ఎంఎల్‌డీ ప్లాంట్ నిర్మాణం**

ఒకప్పుడు కందుకూరు పట్టణంలో గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు రూ.100 కోట్ల నిధులిచ్చి కందుకూరు మున్సిపాలిటీ నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. ఇందుకోసం ప్రకాశం జిల్లాలోని రామతీర్థం ప్రాజెక్ట్ నుంచి కందుకూరు వరకు పైప్‌లైన్ వేసి ఉప్పుచెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికీ నీటి సరఫరా చేస్తున్నారు. అయితే పట్టణంలో క్రమంగా గృహాల సంఖ్య పెరగడం, పలు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమైన నేపథ్యంలో శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇందుకు కారణం దాదాపు పన్నెండేళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేకపోవడం. అదే సమయంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉంది. ఈ నీటిశుద్ధి కోసం ప్రస్తుతం 7 ఎంఎల్‌డీ (మిలియన్స్ ఆఫ్ లీటర్స్ పర్ డే) సామర్థ్యం గల నీటి శుద్ధి ప్లాంట్ అందుబాటులో ఉంది. కానీ ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా ప్లాంట్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో అదనంగా మరో 5 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్‌ను నిర్మించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**నిరంతర నీటి సరఫరాకు అవకాశం**

ప్రస్తుతం కందుకూరు పట్టణంలో దాదాపు 70 వేల వరకు జనాభా నివసిస్తుండగా ఒక్కొక్కరికి 100 ఎల్‌పీసీడీ (లీటర్ పర్ కేపిటా పర్ డే) చొప్పున నీటి సరఫరా జరుగుతోంది. అది కూడా వివిధ సమయాలు నిర్ణయించి ఆయా ప్రాంతాలకు రోజుకు ఒక గంట చొప్పున నీరు సరఫరా చేస్తున్నారు. అలాగే ఆనందపురం చుట్టుగుంట, గనిగుంటతోపాటు మొత్తం 7 గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ఈ గ్రామాలు పట్టణానికి కనీసం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. సుందరయ్యనగర్, లుంబినీవనం తదితర శివారు ప్రాంతాలకు సైతం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇందుకోసం కొత్త పైప్‌లైన్ వేయాల్సి ఉంది. ఇలాంటి సమస్యలన్నీ నూతనంగా నిర్మించే 5 ఎంఎల్‌డీ ప్లాంట్‌తో తీరే అవకాశం ఉంది. అలాగే ఒక గంట నీటి సరఫరాకు బదులు 24 గంటలు పట్టణంలో 175 ఎల్‌పీసీడీ చొప్పున నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే పట్టణంలో నీటి సమస్య అనే మాటే ఉండదు.

**8 కుంటల అభివృద్ధి**

పట్టణంలో ఉన్న గుండంకట్ట, ముత్యాలగుంట, కోమటికుంట వంటి 8 కుంటల అభివృద్ధికి అమృత్ పథకంలో ప్రతిపాదించారు. తద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. పట్టణంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కుంటల అభివృద్ధి అమృత్ పథకం ద్వారా నెరవేరనుంది.

అమృత్ 2.0 పథకానికి కందుకూరు ఎంపిక



ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిశుద్ధి ప్లాంట్



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

**రూ.25.7 కోట్ల నిధుల కేటాయింపు**

అమృత్ 2.0 పథకం ద్వారా ఎంపికైన కందుకూరు మున్సిపాలిటీకి ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ వాటర్ సప్లై పేరుతో రూ.25.7 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో ఈ పథకం ద్వారా చేపట్టనున్న పనులకు సంబంధించి డీపీఆర్‌లు తయారు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తున్నారు.

**కందుకూరు పట్టణంలో..**

- ప్రస్తుతం గృహాల సంఖ్య - 17 వేలు
- జనాభా - 70 వేల మంది
- కుళాయి కనెక్షన్లు సుమారు - దాదాపు 10 వేలు
- అమృత్ 2.0 ద్వారా కేటాయించిన నిధులు - రూ.25.7 కోట్లు

**నీటి సరఫరా మెరుగుపడుతుంది**

అమృత్ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు రూ.25.7 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో 5 ఎంఎల్‌డీ నీటిశుద్ధి ప్లాంట్ నిర్మిస్తాం. కుంటలను అభివృద్ధి చేస్తాం. 24 గంటలు పట్టణంలో తాగునీటిని సరఫరా చేస్తాం.
– ఎస్.మనోహర్, మున్సిపల్ కమిషనర్

# విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తతతో మెలగాలి




- ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి అధికారి, ఉద్యోగి విధినిర్వహణలో దేశ సైనికుల వలె ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి సూచించారు. నగరంలోని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్ ప్రాంగణంలో స్కాడా సిస్టం పనితీరును మంగళవారం ఆయన ఏపీ ఈఆర్సీ సభ్యులు ఠాగూర్‌రామసింగ్, వెంకటరామిరెడ్డి, సీఎండీ సంతోషరావులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్పీడీసీఎల్, డిస్కం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కాడా సిస్టం ద్వారా విద్యుత్ సరఫరాలో వచ్చే అంతరాయాలను వెంటనే గుర్తించి సమస్య వచ్చిన విద్యుత్‌లైన్లను వేరు చేసి మరొక ఫీడర్ ద్వారా తక్షణమే విద్యుత్ అందించవచ్చని తెలిపారు. తద్వారా తక్కువ వ్యవధిలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చని తెలిపారు. ట్రాన్స్‌కో, డిస్కం అధికారుల సమన్వయంతోనే విద్యుత్‌రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం స్కాడా కార్యాలయం వద్ద మొక్కను నాటారు.

**విద్యుత్ సంస్థల పనితీరుపై నిరంతరం సమీక్ష**

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థలైన ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కోల పనితీరుపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యుత్ వ్యవస్థలో ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆఫ్ పర్ఫార్మెన్స్) కచ్చితంగా పాటించాలన్నారు. నెల్లూరు నగరంలో వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరాకు మరో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ట్రాన్స్‌కో అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో, డిస్కం డైరెక్టర్లు భాస్కర్‌రావు, సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని, శ్యాంప్రసాద్, ఎస్ఈలు వెంకటసుబ్బయ్య, శ్రీనివాస్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ దుర్ఘటనలను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

కావలి: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనను నిరసిస్తూ కావలిలో మంగళవారం పలు సంఘాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. స్థానిక ట్రంక్ రోడ్డులోని గాంధీబొమ్మసెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తు ల ర్యాలీ జరిగింది. సేవ్ మణిపూర్.. రేపిస్టులను తక్షణం ఉరితీయాలి.. దుశ్శాసన పర్వంలో పాల్గొన్న మృగాళ్లను శిక్షించాలి.. మణిపూర్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించాలి.. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో కుకి తెగ వారిని ఊచకోతకోయడం, మహిళలను నగ్న ప్రదర్శన చేయించి గ్యాంగ్ రేప్ చేసి వారి కుటుంబసభ్యులను చంపేయడం ప్రపంచ దేశాల ముందు భారతదేశం తలదించుకునేలా చేసిందన్నారు. మణిపూర్‌లో జరిగిన దురాగతాలు మరెక్కడా జరగకుండా నిరసనోద్యమాలను కొనసాగించాలన్నారు.

# 'ఫ్యామిలీ డాక్టర్'తో వైద్యం చేరువ



జువ్విచెట్టుపాళెంలో గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

జలదంకి: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ప్రజలకు వైద్యం మరింత చేరువవుతుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మంగళవారం జలదంకి మండలంలో కలెక్టర్ పర్యటించి తనిఖీలు చేపట్టారు. ముందుగా చామదల పంచాయతీ ఆదిరెడ్డిపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఆదిరెడ్డిపాళెం ఎస్టీకాలనీ వాసులు తమ ఇళ్లు వర్షాలకు ఉరుస్తున్నాయని, కొత్త ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా వారికి ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బ్రాహ్మణక్రాక వద్ద రైతులు పొలాలకు వెళ్లే బాట సమస్యలను తెలుపగా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. గ్రామంలోని ఆర్బీకే పరిధిలో పంట నష్టపరిహారం విషయంలో తమకు అన్యాయం జరిగిందని రైతులు వివరించడంతో రికవరీకి ఆదేశించామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తదుపరి జువ్విచెట్టుపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామస్తులు తమ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవని, శ్మశానానికి స్థలం కావాలని కోరడంతో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిందని, అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం వైద్యం, విద్యకు పెద్దపీట వేసిందని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న పోషకాహారం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ శీనానాయక్, వింజమూరు సీడీపీఓ పద్మజాకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్ బాబు, ఏఓ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, హౌసింగ్ ఏఈ ప్రసాద్, వైద్యసిబ్బందితోపాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమావతి పాల్గొన్నారు.

# బాలుర సింగిల్స్ విజేత నెల్లూరు




రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, అసోసియేషన్ సభ్యులు

**విజేతలు వీరే..**

| విభాగం | ప్రథమస్థానం | ద్వితీయస్థానం |
|---|---|---|
| బాలుర సింగిల్స్ : | టి.హనీష్‌దానీ (నెల్లూరు) | వీఎస్ మణికంఠారెడ్డి (నెల్లూరు) |
| బాలుర డబుల్స్ : | ఎండీ ఖరమత్ యుబి హక్ (ప్రకాశం) | ప్రగాఢ బాలప్రణయ్ (విశాఖ) |
| | వీఎస్ మనికంఠారెడ్డి (నెల్లూరు) | కోడె విష్ణుకేదార్ (ప్రకాశం) |
| బాలికల సింగిల్స్ : | జి.పూజిత (కడప) | డి.జశ్విత (విశాఖ) |
| బాలికల డబుల్స్ : | డి.దీపిక (గుంటూరు) | కె.వైష్ణవిరెడ్డి (నెల్లూరు) |
| | డి. స్రవంతి (గుంటూరు) | మట్టే ఈషా (ప్రకాశం) |
| మిక్స్‌డ్ డబుల్స్ : | ఎండీ ఖరమత్ యుబి హక్ (ప్రకాశం) | కోడె విష్ణు కేదార్ (ప్రకాశం) |
| | డి.దీపిక (గుంటూరు) | ఆర్.స్ఫూర్తి (అనంతపురం) |

- బాలికల సింగిల్స్ విజేత కడప
- ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు మంగళవారం ముగిశాయి. సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఇండోర్ స్టేడియం మరమ్మతులు, ఆధునికీకరణకు సుమారు రూ.2 కోట్ల ప్రభుత్వ గ్రాంటును ఇచ్చేందుకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఇండోర్ స్టేడియంను ఆధునికీకరిస్తే జాతీయస్థాయి పోటీలను నిర్వహించవచ్చన్నారు. మొగల్లపాళెంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ అకాడమీని ఏర్పాటు చేసి జిల్లా క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో సీఎం కప్, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లీగ్‌లు నిర్వహించడం ద్వారా క్రీడాకారులందరూ ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. త్వరలో 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించే పోటీలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 రోజులపాటు క్రీడాకారులకు పండగ వాతావరణం నెలకొంటుందన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో విజయవాడలో ఏపీ సీఎం జగన్స్ యునెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 75 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, టీమ్ మేనేజర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్‌కే యతిరాజ్, నెల్లూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దూడల సుధాకర్, టోర్నీ నిర్వాహక కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, అసోసియేషన్ కోశాధికారి వెంకటశ్రీకాంత్, సభ్యులు రామ్మోహన్, వరప్రసాద్, సీనియర్ క్రీడాకారుడు కోటా సూర్యనారాయణ, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. వివిధ జిల్లాల అసోసియేషన్ల కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



డబుల్స్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

## ముసురు పట్టి..

- జిల్లాలో ఎడతెరపి లేని జల్లులు
- మరో రెండు రోజులపాటు వర్షాలు



అనంతసాగరంలో కురుస్తున్న జోరువాన

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ముసురు పట్టి ఎడతెరపి లేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలురోడ్లు జలమయమయ్యాయి. చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ, వరి పంటలకు మేలు చేకూరుస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మరో రెండు రోజులు వర్షాలు**

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం మరింత బలపడింది. ఈ ప్రభావంతో మరో రెండు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే భారీ నుంచి అతి భారీ వర్షాలతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, బలమైన గాలులు వీచే అవకాశం ఉంది.

## క్లుప్తంగా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

### ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ

• మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : ఈనెల 29 నుంచి ఐదు రోజుల పాటు రొట్టెల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మేయర్ స్రవంతి అన్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో మేయర్ తన చాంబర్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా నిర్వహించే రొట్టెల పండగకు జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దర్గా ప్రాంగణంలో అవసరమున్న అన్ని విభాగాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి భక్తుల మధ్య తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ నిరంతరం దర్గా ప్రాంగణం, సమీప ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కార్యాలయంలోని అన్ని విభాగాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

### పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | :121 |
| లేయర్ (లైవ్) | : 88 |
| బ్రాయిలర్ చికెన్ | :212 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | :236 |
| లేయర్ చికెన్ | :150 |







# రైతు సేవలో అగ్రిల్యాబ్

వ్యవసాయంలో రైతులకు ఎలాంటి నష్టాలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. గతంలో విత్తనాలు, ఎరువుల పరీక్షలకు నెలల తరబడి సమయం పట్టేది. ప్రస్తుతం కేవలం రెండు నుంచి మూడు రోజుల్లో విత్తనాలు, ఎరువుల నాణ్యతను వారికి తెలియజేసి సాగులో నష్టాలు రాకుండా చూస్తోంది.

**మూడు రోజుల్లోనే విత్తనాలు, ఎరువుల పరీక్షల ఫలితాలు**
- నియోజకవర్గానికో ల్యాబ్ ఏర్పాటు
- పూర్తి ఉచితంగా నిర్ధారణ పరీక్షలు



ఉదయగిరిలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రైతులు ఎక్కువ శాతం సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాగా ఇప్పటికే రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో వ్యవసాయ సేవలు గ్రామస్థాయిలో అందుతున్నాయి. అయితే విత్తనాలు, ఎరువుల విషయంలో అనేక జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వీటి నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఆరు ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. కాగా నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతాలకు నెల్లూరులోని ప్రధాన వ్యవసాయశాఖ కార్యాలయంలో ల్యాబ్ అందుబాటులో ఉంది. కేవలం మూడు రోజుల్లోనే ఎరువులు, విత్తనాల నాణ్యతా ప్రమాణాలను పరీక్షలు చేసి రైతులకు అందజేస్తుంది.

**గతంలో ఇలా..**

గతంలో ఎరువులు, విత్తనాల నాణ్యతా పరీక్షల కోసం ఇతర జిల్లాలకు పంపాల్సిన అవసరం ఉండేది. దీంతో అక్కడి నుంచి రిపోర్టు వచ్చేసరికి దాదాపుగా 30 నుంచి 45 రోజుల సమయం పట్టేది. దీంతో చాలా మంది రైతులు మార్కెట్‌లో కొన్న వాటిని నేరుగా వినియోగించే వారు. దీంతో చాలా చోట్ల నకిలీ వాటిని వినియోగించడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి వచ్చేవి. కానీ కొత్తగా ల్యాబ్‌లు రావడంతో ఆయా నియోజకవర్గల పరిధిలోనే ల్యాబ్‌లు ఉండడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మూడు రోజుల్లో రిపోర్టు ఇస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రూ.కోటి వ్యయంతో**

రైతుల కోసం నిర్మించే ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్నారు. అందులో విత్తనాలు, ఎరువులను పరీక్షలు చేసేందుకు ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు వ్యవసాయశాఖ అధికారి, ఇద్దరు సహాయ అధికారులతో పాటు, మరికొంత మంది సిబ్బంది ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు వచ్చిన శాంపిల్స్‌ను పరీక్షలు చేసి నాణ్యతా ప్రమాణాలను నిర్ధారిస్తారు.



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

**త్వరగానే ఫలితాలు**

జిల్లాలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో చాలా ఆలస్యంగా ఫలితాలు వచ్చేవి. ప్రస్తుతం ఎప్పటికప్పుడు ఫలితాలు వస్తుండడంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. ల్యాబ్‌లను రైతులు ఎక్కువగా వినియోగించుకుంటున్నారు.

– నర్సోజి, వ్యవసాయశాఖ ఏడీ, నెల్లూరు





రాజారెడ్డిని సత్కరించిన వర్క్‌షాప్ మేనేజర్, సిబ్బంది

# అభివృద్ధి పథంలో ఆర్టీసీ

• ఆర్టీసీ బోర్డ్ డైరెక్టర్ రాజారెడ్డి

కోవూరు : దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆర్టీసీకి జీవం పోశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. కోవూరులోని జోనల్ వర్క్‌షాప్‌లో మంగళవారం కార్మికులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ కష్టాల ఊబిలో కూరుకుపోయిన సమయంలో దివంగత వైఎస్సార్ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆదుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరిస్తూ అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం తిరుపతి, కడపలో వైద్యశాలల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 26 ఆర్టీసీ బస్టాండ్ల నిర్మాణంలో ఉన్నాయన్నారు. నూతనంగా 1,500 బస్సులను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా 36 ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. రెండు వేలకు పైగా కారుణ్య నియామకాలను భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జోనల్ సిబ్బంది షమీమ్, మురళీబాబు, ఓబుల్‌రెడ్డి, సురేష్‌బాబు, రమణయ్య, సాజిద్దున్ తదితరులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులోకి గోదాములు

• డీసీఓ సుధాభారతి

ఉదయగిరి: రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా రైతుల పంటల ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు, ఆరబెట్టుకునేందుకు నిర్మించిన గోదాములను త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తెస్తామని జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి సుధాభారతి తెలిపారు. ఆమె మంగళవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి సమీపంలో నిర్మించిన గోదామును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేలకు అనుబంధంగా రైతు సంక్షేమం కోసం నాబార్డు నిధులు రూ.17.60 కోట్లతో జిల్లాలో 44 గోదాములు నిర్మిస్తోందన్నారు. ఇప్పటికే రెండు గోదాములు ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మిగిలిన గోదాములు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆమె తొలుత ఉదయగిరిలోని కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. అనంతరం కొండాయపాళెం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. ఆమె వెంట సబ్ డివిజన్ అధికారి శ్రీనివాసులురెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, సీఈఓ పోలయ్య, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ, తదితరులున్నారు.

**పెట్రోల్ బంకులతో సొసైటీల బలోపేతం**

సీతారామపురం : పెట్రోలు బంకుల నిర్మాణంతో సొసైటీల బలోపేతానికి కృషి చేస్తున్నామని జిల్లా కోఆపరేటివ్ అధికారిణి సుధాభారతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి సొసైటీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సొసైటీ కార్యాలయాల్లో పెట్రోలు బంకులు ప్రారంభిస్తామన్నారు.

# వాచ్‌మెన్ దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : రైల్వేస్టేషన్ విస్తరణ పనుల వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్యచేశారు. ఈ ఘటన రైల్వేస్టేషన్ తూర్పు టెర్మినల్ వైపు మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేట గొల్లవీధిలో ఎం.సుబ్రహ్మణ్యం (48), గాయత్రి దంపతులు ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు దివాకర్ డిగ్రీ చేసి ఇంటివద్దే ఉంటుండగా, కుమార్తె డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. సుబ్రహ్మణ్యం పగటిపూట ఇంటి వద్దనే దుస్తులను ఇస్త్రీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య సహాయకారిగా ఉంటుంది. గడిచిన మూడునెలలుగా రాత్రివేళల్లో రైల్వేస్టేషన్ విస్తరణ పనుల వద్ద వాచ్‌మెన్‌గా సుబ్రహ్మణ్యం విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలానే సోమవారం సాయంత్రం ఆయన విధులకు వెళ్లారు. రాత్రి సుమారు పది గంట సమయంలో భార్య, కుమారుడు ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. ఏం జరిగిందో తెలియదుకానీ ఆయన పనిచేస్తున్న చోట మంగళవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. తల, కన్ను, చెవివద్ద గాయాలై తీవ్ర రక్తస్రావమైన స్థితిలో మృతదేహం పడి ఉంది. దీనిని వర్క్ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి ఉదయం గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు మృతుని కుమారుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై తిరుపతయ్య తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పదునైన ఆయుధంతో దాడిచేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వైద్యులు శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

**విభిన్న కోణాల్లో దర్యాప్తు**

హత్య ఘటనపై ఇన్‌స్పెక్టర్ విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతునికి ఎవరితోనైనా విభేదాలున్నాయా? స్థానికంగా ఉండే పాత నేరస్తులు ఇలాంటి ఘాతుకానికి ఒడిగట్టారా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. గతంలో రైల్వేస్టేషన్‌లో, బుకింగ్ కౌంటర్‌ల వద్ద సీసీ కెమెరాలు ఉండేవి. విస్తరణ పనుల నేపథ్యంలో అవి పనిచేయడం లేదు. దీంతో సమీపంలోని సీసీపుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇలా జరిగి ఉండొచ్చనే ఆరోపణల నేపథ్యంలో ఆ దిశగా పోలీసులు విచారిస్తున్నారు.

### పొదలకూరు నిమ్మధరలు (కిలో)



| | |
|---|---|
| పెద్దవి | :రూ.37 |
| సన్నవి | :రూ.20 |
| పండ్లు | :రూ.7 |

## పూడ్చిన మృతదేహం వెలికితీత



మోహన్ మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

లింగసముద్రం: తిరుపతి జిల్లాలో ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న త్రిపురాంతకం మోహన్ (56) ఈనెల 13వ తేదీన మృతిచెందగా రెండో భార్య కుటుంబసభ్యులు పూడ్చిపెట్టారు. అయితే మొదటి భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం పూడ్చిన మృతదేహాన్ని వెలికితీయించినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. అందిన వివరాల మేరకు.. నెల్లూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న మోహన్ తిరుపతి జిల్లాలో ఏఆర్ ఎస్సైగా పని చేస్తున్నాడు. మోహన్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. నెల్లూరులో మొదటి భార్య, లింగసముద్రం మండలం వీఆర్ కోట గ్రామంలో రెండో భార్య నివాసం ఉంటున్నారు. ఈనెల 9న మోహన్ తన రెండో భార్య కందుకూరి పద్మావతి ఇంటికి వచ్చాడు. 13న ఆయన మృతిచెందగా మొదటి భార్య మాధవికి తెలియకుండా మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. భర్త ఇంటికి రాకపోవడం.. ఎక్కడ ఉన్నాడో ఆచూకీ తెలియక పోవడంతో ఆరా తీయగా వీఆర్ కోటలో రెండో భార్య వద్ద మృతి చెందినట్లు తెలుసుకున్నారు. ఈ విషయమై లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో మొదటి భార్య కుమారుడు రిత్విక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. వీఆర్‌కోటలో తహసీల్దార్ మీరావలీ, నెల్లూరు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు సమక్షంలో మంగళవారం పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.

### 27న భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(సెంట్రల్) : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ నెల్లూరు ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న సమావేశం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రొవిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్లా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గం, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

### వర్సిటీలకు పాలక మండలిని నియమించాలి

వెంకటాచలం : రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాలకు పాలకమండలి సభ్యులను నియమించాలని ఏబీఆర్‌ఎస్ఎం(అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంగ్) రాష్ట్ర అధ్యక్షుడు వైపీ రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపక నియామకాలను పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వినతి పత్రాన్ని పంపామని తెలిపారు.